వడదెబ్బతో వ్యక్తి మృతి



పాలకొండ, ఏప్రిల్ 4: మండలంలోని తంపటాపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ రామకృష్ణ (52) అనే వ్యక్తి వడదెబ్బతో గురువారం మృతి చెందాడు. రామకృష్ణ తుమ రాడ పరిధిలోని కామినేని చేపల చెరువు కాపలాదారుడిగా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం చెరువు వద్దే వడ దెబ్బకు గురై మృతి చెందాడు. సాయంత్రం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా రామకృష్ణ విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో బోరున విలపించారు.

నాన్నమ్మ కష్టం చూడలేక..

- మంచాన్ని ట్రాలీగా మార్చిన యువకుడు
- దాన్ని బైక్‌కు అనుసంధానం చేసిన వైనం
- దాంట్లో వృద్ధురాలిని కూర్చొబెట్టి ప్రయాణం



ట్రాలీ బండిపై నాన్నమ్మను తీసుకువెళ్తున్న దృశ్యం

కురుపాం, ఏప్రిల్ 4

మారుమూల గిరిజన గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలికి కాలుకు గాయమై ఎటూ కదల్లేని పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో ఆమె గతంలో చేసిన ఉపాధి హామీ పథకం డబ్బులు బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఆ డబ్బులు తీసుకోవడానికి 29 కిలోమీటర్లు వెళ్లాలి. అంత దూరం వెళ్లలేక ఇంట్లోనే ఉండిపోయింది. దీంతో తన నాన్నమ్మ పడుతున్న కష్టాన్ని ఆ యువకుడు చూడలేకపోయాడు. ఆ వృద్ధురాలి కోసం మంచాన్ని ట్రాలీగా మార్చాడు. దాన్ని తన ద్విచక్ర వాహనానికి తాళ్లతో కట్టి నాన్నమ్మను అందులో కూర్చొబెట్టి బ్యాంకుకు తీసుకెళ్లాడు. గుమ్మలక్ష్మీపురం మండలం జర్న పంచాయతీ దిగువ చోరుపల్లి గ్రామానికి చెందిన మండంగి చిన్నమ్మి (72) కాలుకు గాయమైంది. దీంతో ఆటో, ఇతర వాహనాలను ఎక్కలేక ఇబ్బంది పడేది. ఇది చూసిన తన మనుమడు మండంగి శివ (22) గొప్ప ఆలోచన చేశాడు. నాన్నమ్మ కూర్చోవడానికి, పడుకోవడానికి వీలుగా ఓ మంచాన్ని ట్రాలీలా తయారు చేశాడు. దానికి రెండు చక్రాలు అమర్చాడు. ఆ ట్రాలీని తన బైక్‌కు తాళ్లతో కట్టాడు. చిన్నమ్మి ఎక్కడకు పనిమీద వెళ్లిన ట్రాలీలో ఆమెను కూర్చొబెట్టి శివ తీసుకెళ్తున్నాడు. ఇటీవల జాతీయ ఉపాధిహామీ పథకం డబ్బులు చిన్నమ్మి అకౌంట్‌లో పడ్డాయి. దీంతో గురువారం 29 కిలోమీటర్ల దూరంలో ఉన్న కురుపాంలోని గ్రామీణ వికాస్ బ్యాంకుకు ట్రాలీపై చిన్నమ్మిని తీసుకొచ్చాడు. ఈ దృశ్యాలను అక్కడున్న వారు తమ ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీశారు.

వైసీపీ ప్రచారంలో క్షేత్ర సహాయకుడు

జియ్యమ్మవలస, ఏప్రిల్ 4: కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు ఎన్నికల నియమావళి పట్టనట్లు లేదు. ఇష్టారాజ్యంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు పాముల పుష్పశ్రీవాణి గురువారం జియ్యమ్మవలస మండలం ఎం.అల్లువాడలో ప్రచారం ప్రారంభించారు. ఈ ప్రచారంలో కొమరాడ మండలం పెద శాఖ పంచాయతీకి చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు పసుపురెడ్డి పరమేశు (బుజ్జి) పాల్గొన్నాడు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ జై జగన్.. వైసీపీకి ఓటు వేయండి అంటూ నినాదాలు చేశాడు. ఇతనిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ పరమేశు (వృత్తంలో గడ్డంతో ఉన్న వ్యక్తి)

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి

- రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్

సాలూరు, ఏప్రిల్ 4: ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సాలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. సాలూరు పట్టణంలోని పెద్దహరిజనపేట, చినహరిజనపేట పోలింగ్ కేంద్రాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సౌకర్యాలు ఉండాలని స్పష్టం చేశారు. అలాగే, సాలూరు పట్టణంలో రహదారులు, భవనాల శాఖ అతిథి గృహంతో పాటు రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సైతం తనిఖీ చేసి ఏర్పాట్లు, వసతులు పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సీ విజిల్, ఆన్‌లైన్ ద్వారా అందే ఫిర్యాదులను పరిశీలిస్తామని చెప్పారు. అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రచారానికి తప్పనిసరిగా అనుమతులు ఉండాలని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సింహాచలం, పలువురు అధికారులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు..

సాలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న ఉపాధ్యాయులకు ఎలక్షన్ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు గురువారం వచ్చాయి. సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల పలువురు ఉపాధ్యాయులకు పీవో, ఏపీవో ఆర్డర్లను పంపిణీ చేశారు. పీవో, ఏపీవోలకు ఎన్నికల నిర్వహణపై ఈనెల 12న సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో ఎన్నికల నిర్వహణపై ఏఎల్ఎంటీ (అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనీలు) పీవో, ఏపీవోలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఎన్నికల్లో ఇంకు మార్క్ వేయడం, పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడానికి బ్యాలెట్ జారీ తదితర విధులు నిర్వహించే ఓపీవో (అదర్ పోలింగ్ ఆఫీసర్) ఆర్డర్లు సైతం వచ్చాయి. వాటిని శనివారం పంపిణీ చేసే అవకాశాలు ఉన్నాయి.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు..

కురుపాం: రాజకీయ కార్యక్రమంలో పాల్గొన్న ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ (అవుట్ సోర్సింగ్) డప్పుకోట అశోక్‌కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ నిశాంత్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కొమరాడ మండలం మాదలింగి పీహెచ్‌సీకి చెందిన ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్న అశోక్‌కుమార్ గత నెల 25న వైసీపీ ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి సమక్షంలో జరిగిన ఓ రాజకీయ కార్యక్రమంలో పాల్గొన్నాడు. దీనిపై కురుపాం రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు అందింది. ఈ మేరకు విచారణ చేపట్టగా నిజమని తేలింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్నట్టు అశోక్‌కుమార్ అంగీకరించాడని కురుపాం రిటర్నింగ్ అధికారి వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక సమర్పించగా అశోక్‌కుమార్‌ను విధుల నుంచి తొలగించారని చెప్పారు.



పెద్ద హరిజనపేటలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో విష్ణుచరణ్

వైద్యంలో స్థాయి పెరగలే

- ప్రాంతీయ ఆసుపత్రిగా మారినా మెరుగు కాని సేవలు
- శిక్షణ సిబ్బందితో ఇంజెక్షన్‌లు
- ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు ఓపీ
- అత్యవసర చికిత్స పేరుతో రిఫరల్సే అధికం



ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి

● శృంగవరపుకోట ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్సరే గది తలుపులు మూయకుండానే ఎక్సరేలు తీస్తున్నారు. రేడియేషన్ ప్రభావం పడుతుందన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. దీనిపై సిబ్బందిని ప్రశ్నిస్తే తమ ఆరోగ్యం పాడవదా అని ఎదురు ప్రశ్న వేస్తున్నారు.

● రోగులకు నర్సింగ్ చదువుతున్న విద్యార్థులతో ఇంజెక్షన్ ఇప్పిస్తున్నారు. ప్రత్యేక గది కాకుండా వరండాలోనే ఇంజెక్షన్‌లు ఇస్తుండడతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

● ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు కూర్చొని ఓపీ చూస్తున్నారు. అక్కడే రోగులు వరుస కట్టాల్సిన పరిస్థితి. రోగి ఏ డాక్టరు వద్దకు వెళ్లాలో స్పష్టంగా చెప్పేవారెవరూ లేరు. మహిళా రోగులకు అవస్థలు తప్పడం లేదు.

శృంగవరపుకోట, ఏప్రిల్ 4

ఎస్.కోట ఆస్పత్రికి ఇటీవల కుక్క కాటేసిన చిన్నారి వచ్చింది. గాయం నుంచి కారుతున్న రక్తాన్ని కడిగి తీసుకురావాలని వైద్యులు బాలిక తండ్రికి సూచించారు. ఆసుపత్రి కుళాయిల వద్ద నీరు రాలేదు. పట్టించుకునేవారే లేక ఇంటికి తీసుకెళ్లి గాయాన్ని శుభ్రం చేసి తీసుకొచ్చాడు. సమయం పట్టడంతో గాయం వద్ద తిరిగి రక్తస్రావం కనిపించింది. వైద్యులు మళ్లీ కడగాలని చెప్పారు. దీంతో ప్రాథమిక వైద్యం చేసేందుకు గంటన్నరకు పైగా సమయం పట్టింది. ఓపీ చీటిలో చిన్నారి వయసు, ఇవ్వాల్సిన డోసును పేర్కొనలేదు. బాలిక తండ్రి ప్రశ్నించినా పట్టించుకోలేదు. ఈ ఆసుపత్రి వైద్యంపై నమ్మకం లేక రెండో డోస్ నుంచి ఎస్.కోటకు దగ్గరలో ఉన్న ఓ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుమార్తెను తీసుకెళ్లాడు.

ఎస్.కోట ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. అడిగితే దురుసుగా సమాధానం చెబుతుండడంతో రోగులు, బంధువులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి దుర్భర పరిస్థితులు ఉన్నా ఈ ఆసుపత్రి గురించి స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాత్రం తరచూ గొప్పగా చెబుతుండడం గమనార్హం. 'కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించే స్థోమత ఉన్నా మా నాన్నకు ఇక్కడే వైద్యం చేయించాను' అని అంటుంటారు. ఎమ్మెల్యే కాబట్టి ఆయన తండ్రికి ఆ స్థాయిలో వైద్యం అంది ఉండొచ్చు. సాధారణ ప్రజలకు అక్కడ చుక్కలు కనిపిస్తాయన్నది రోగల మాట. ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిగా వున్న దీనిని ప్రాంతీయ ఆసుపత్రిగా మార్చారు. ప్రత్యేక వైద్యులు, సిబ్బంది రావడంతో మెరుగైన చికిత్సలు అందుతాయని అంతా భావించారు. జిల్లా కేంద్రాసుపత్రి, కేజీహెచ్‌లకు వెళ్లాల్సిన అవసరం ఉండదనుకున్నారు. కానీ అంతా పేదలు ఊహించిన దానికి భిన్నంగా జరుగుతోంది. వైద్య సేవలు మెరుగు అవ్వకపోగా మరింత దిగజారాయి.

ఎక్కడెక్కడి నుంచో వైద్యం కోసం..

నియోజకవర్గంలోని శృంగవరపుకోట, లక్కవరపుకోట, వేపాడ, కొత్తవలస, జామి మండలాలతో పాటు గజపతినగరం నియోజకవర్గంలోని గ్రామాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, అనంతగిరి, డుంబ్రిగూడ గిరిజన మండలాల నుంచి రోగులు ఎక్కువగా ఈ ఆసుపత్రికి వస్తారు. ఎంతో ఆశతో వచ్చి నిరాశతో వెళ్తున్నారు. ప్రసవం కోసం వచ్చే గర్భిణులను కూడా విజయనగరం ఘోషాకు రిఫర్ చేస్తున్నారు. ఉన్నతాధికారులతో మాటకాయకుండా ప్రభుత్వం ఇచ్చే టార్గెట్‌ను మాత్రం పూర్తిచేసేస్తున్నారు.

అంతా నర్సింగ్ విద్యార్థులే..

ప్రాంతీయ ఆసుపత్రిగా రూపాంతరం చెందడంతో ప్రైవేటు నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో ఎక్కడ చూసినా వారే కనిపిస్తున్నారు. శిక్షణలో వున్న వారితో ఇంజెక్షన్‌లు సైతం చేయించేస్తున్నారు. రోగులకు సెలైన్‌లు ఎక్కించేటప్పుడు నరాన్ని పట్టుకోవడంలో అనుభవం లేకపోవడంతో సూదులతో కుట్టేస్తుండడంతో చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఇబ్బందులు పడుతున్నారు. ● ఆసుపత్రిని విస్తరించడంతో కొత్త భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.12.60 కోట్లు మంజూరు చేసింది. 2020 అక్టోబర్ 26న నిర్మాణాలు ప్రారంభించారు. 2022 జనవరి 25నాటికి పూర్తి కావాల్సి వుంది. ఇప్పటికి అదనపు గదులు నిర్మాణ దశలోనే ఉన్నాయి.

సామాన్యులకు కష్టమే..

ఆసుపత్రిలో కుళాయిల నుంచి చుక్కనీరు రాదు. ప్రాథమిక చికిత్సకు గంటల తరబడి నిరీక్షించాలి. సూపరింటెండెంట్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోగులంటే నిర్లక్ష్యం. ఓపీ చీటీపై సమయం, వైద్యుల సంతకం వుండడం లేదు. సామాన్య ప్రజలకు పూర్తిస్థాయి వైద్యం అందడం లేదు.

-బొబ్బిలి రామకృష్ణ, న్యాయవాది, శృంగవరపుకోట

సవ్యంగా సాగడం ఇష్టం లేకే..

- అసౌకర్యాల నడుమ పింఛన్ల పంపిణీ
- ఇబ్బందులుకు గురిచేసే పన్నాగంలో వైసీపీ ప్రభుత్వం
- కావాల్సినంతగా ఉద్యోగులున్నా సచివాలయాలకే రప్పించిన వైనం
- ఇప్పటికీ కొన్నిచోట్ల కానరాని మౌలిక వసతులు



వెంకటరమణపేట సచివాలయం వద్ద మండుటెండలో కూర్చున్న వృద్ధులు

వైసీపీ ప్రభుత్వం అనుకున్నట్టే చేస్తోంది. పింఛను డబ్బులను తొందరంగా సవ్యంగా ఇచ్చే అవకాశం ఉన్నా పేదలు ఇబ్బందులు పడేలా వ్యవహరించింది. వాటిని ప్రతిపక్షాలకు ఆపాదిస్తోంది. పింఛన్లతో దుర్రాజకీయం చేస్తోంది. మూడు రోజులు ఆలస్యంగా పంపిణీ చేపట్టేలా వ్యవహరించింది. సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీని సక్రమంగా చేపట్టేలా నిర్దేశించలేదు. ఎలక్షన్ కమిషన్ సూచించాకే ఏ చర్య అయినా తీసుకుంటోంది. అధికారంలో ఉన్న కారణంగా ప్రతి చిన్న అవకాశాన్నీ ఎన్నికలకు మల్చుకుంటోంది. మంచి జరిగితే తమ ప్రతిభగా ప్రచారం చేస్తోంది. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలను ప్రతిపక్షాల కుట్రగా పేర్కొంటోంది. ముందస్తు వ్యూహంతో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు పాచికలు వేస్తూనే ఉంది.

(పార్వతీపురం/ విజయనగరం-ఆంధ్రజ్యోతి)



రాజాం: నిధులు రాని విషయం తెలియక పింఛను కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

తాజాగా జరుగుతున్న పింఛన్ల పంపిణీ వ్యవహారాన్ని తమకు అనుకూలంగా మల్చుకోవాలని ప్రయత్నించి వైసీపీ అబాసుపాలైందన్న అభిప్రాయాన్ని ఎక్కువ మంది వ్యక్తం చేస్తున్నారు. కావాలనే ముఖ్యమంత్రి జగన్ పింఛన్ల పంపిణీలో ఇబ్బందులకు గురిచేస్తున్న తీరును లబ్ధిదార్లు, ప్రజలు గుర్తిస్తున్నారు. సచివాలయాల వద్ద కుర్చీలు, షామియానాలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కాని ఈనెల 3 నాటికి అనేక సచివాలయాల్లో వసతులు కల్పించలేదు. అలాగే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేసేందుకు వీలుగా సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. కానీ సచివాలయాల వద్దే పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతిపక్షాల డిమాండ్ తర్వాత వృద్ధులు, నడవలేని వారి ఇళ్లకు ఉద్యోగులు వెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 4,28,726 మంది లబ్ధిదారులు ఉన్నారు. 956 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయంలో 10నుంచి 11మంది పనిచేస్తున్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగికి పింఛను పంపిణీ బాధ్యతలను అప్పగిస్తే ఒకరోజులోనే ఈ తంతు పూర్తి చేయవచ్చు. కానీ ఆ వైపుగా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. లబ్ధిదారులు ఇబ్బందులు పడాలని, వలంటీర్ లేకపోతే కష్టమని, వైసీపీ ప్రభుత్వం అయితే సక్రమంగా జరుగుతందన్న భ్రమను పేదలకు తలపోయాలని ప్రభుత్వం భావించింది. ఈ కుతంత్రాన్ని పేదలైతే గుర్తిస్తున్నారు. ఈ అరకొర ఇబ్బందులను వారు పరిగణనలోకి తీసుకోవడం లేదు.

● **గజపతినగరం:** గజపతినగరం గ్రామ సచివాలయంలో ఉదయం 6 గంటల నుంచే పింఛన్లు అందజేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. సిబ్బంది సమయానికి రాకపోవడంతో పింఛను దారులు నిరీక్షించాల్సి వచ్చింది. పురిటిపెంట సచివాలయంలో ఈఓ జనార్దనరావు ఒక్కరే త్వరగా వచ్చారు.

● **శృంగవరపుకోట రూరల్:** మండలంలోని వెంకటరమణపేట సచివాలయం వద్దకు 9.30గంటలకే పింఛను కోసం వచ్చారు. అప్పటికి సిబ్బంది రాకపోవడంతో కొద్దిసేపు నిరీక్షించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ సకాలంలో డబ్బులు వేసి ఉంటే తమకు ఎందుకు ఈపాట్లు అంటూ వాపోయారు. అయితే పింఛనుదారులకు టెంట్లు వేయలేదు. కూర్చొనేందుకు కుర్చీలు లేవు. కొత్తూరు సచివాలయంలో పదిగంటలైనా సిబ్బంది రాకపోవడంతో కొంతమంది వృద్ధులు వచ్చి కూర్చోవడం కనిపించింది.

● **శృంగవరపుకోట:** ఎస్.కోట పంచాయతీ పరిధి చింతబడికి ఆనుకుని వున్న సచివాలయం వద్ద గురువారం పింఛనుదారుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. ఆధార్ కార్డులను సేకరించి ఒక్కక్కరినీ లోనికి పిలిచారు. పిలుపు వినిపించదన్న అభిప్రాయంతో వారంతా గుమ్మం వద్ద గుమిగూడడంతో గందరగోళం ఏర్పడింది.

● **బొబ్బిలి:** నడవలేని స్థితిలో ఉన్న వారికి, దివ్యాంగులకు ఇంటికొచ్చి పెన్షన్ సొమ్ము అందజేస్తామని సచివాలయ సిబ్బంది చెబుతున్నప్పటికీ పెన్షన్ లబ్ధిదారులు స్వచ్ఛందంగా శిబిరానికి, సచివాలయాలకు వచ్చి పెన్షన్ తీసుకుంటున్న దృశ్యాలు బొబ్బిలిలో గురువారం కనిపించాయి. గొల్లపల్లిలో ఓ వలంటీరు పెన్షన్ల పంపిణీలో జోక్యం చేసుకునేందుకు అత్యుత్సాహం చూపినట్లు సమాచారం రావడంతో మీడియా ప్రతినిధులు వెళ్లగానే వారికి దొరక్కుండా అక్కడి నుంచి చల్లగా జారుకున్నాడు.

● **రాజాం:** నిధులు అందక రాజాం పురపాలక సంఘం పరిధిలో ఉదయం 11 గంటల వరకు వృద్ధులు నిరీక్షించాల్సి వచ్చింది. సచివాలయ ఎడ్మిన్లు పింఛన్ల డబ్బులు కోసం యూనియన్ బ్యాంకు వద్ద గురువారం ఉదయం 9 గంటల నుంచి నిరీక్షిస్తే 11 గంటలకు అందాయి. ఆ వెంటనే సచివాలయం వద్దకు వచ్చి పంపిణీ చేపట్టారు. అలాగే బుచ్చింపేట సచివాలయ తాళాలు ఉదయం 10 గంటల వరకు తెరవకపోవడంతో పింఛనుదారులు ఇబ్బందులు పడ్డారు. కాగా రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న సచివాలయం వద్ద కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో టీడీపీ కార్యకర్తలు పింఛనుదారులకు మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లును పంపిణీ చేశారు.

పింఛన్‌దారుల కష్టాలు..

వీరఘట్టం, ఏప్రిల్ 4: మండలంలోని పింఛన్‌దారులు అష్టకష్టాలు పడుతున్నారు. కొన్ని సచివాలయాలకు ఇంకా ప్రభుత్వం నుంచి నగదు రాకపోవడంతో పింఛన్ల పంపిణీ ఆలస్యమవుతోంది. దీంతో పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు సచివాలయాల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. వీరఘట్టం-3 సచివాలయానికి గురువారం ఉదయం 7 గంటలకు పింఛదారులు చేరుకున్నారు. అయితే సచివాలయ సిబ్బంది 10 గంటల తర్వాత బ్యాంకుకు వెళ్లి నగదును తీసుకొచ్చారు. అప్పటి వరకూ పింఛన్‌దారులు వేచిఉన్నారు. బ్యాంకు నుంచి వచ్చిన తరువాత సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ మొదలుపెట్టారు. మండలంలో సుమారు 390 వరకు అభయహస్తం పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు. నేటికీ వీరికి పింఛన్ల సొమ్ము జమ కాకపోవడంతో సచివాలయాలకు వచ్చి నిరీక్షించి వెళుతున్నారు.



వీరఘట్టం-3 సచివాలయంలో వేచి ఉన్న పింఛనుదారులు



బ్యాంక్‌లో బకాయి పింఛను సొమ్ము విత్ డ్రా కోసం వేచి ఉన్న సాలూరు పంచాయతీ కార్యదర్శులు

ఎన్నికల ఫిర్యాదులపై కఠిన చర్యలు

● విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, ఏప్రిల్ 4: జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు వచ్చినా, దానిపై విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ వివిధ మార్గాల్లో 280 ఫిర్యాదులు వచ్చాయని, వీటిలో 276 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ సుమారు కోటి రూపాయల విలువైన నగదు, మద్యం, వివిధ రకాల వస్తువులను సీజ్ చేశామన్నారు. ఇప్పటి వరకు 15 మంది వలంటీర్లను తొలిగించామని, ఇద్దరు రేషన్ డీలర్లను తొలిగించామని, రాజకీయ పార్టీలపై ఇప్పటి వరకూ 11 కేసులు నమోదు చేశామని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టరు కంట్రోల్ రూంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో అనిత తదితరులు ఉన్నారు.

ఎన్నికల శిక్షణకు ర్యాండమైజేషన్

ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పీవోలకు ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలను కేటాయించారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మి కంప్యూటర్ ద్వారా గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రక్రియ ద్వారా 2,152 మంది ప్రిసైడింగ్ అధికారులు, మరో 2,152 మంది సహాయ ప్రిసైండింగ్ అధికారులకు నియోజకవర్గాలను ఎంపిక చేశారు. వీరికి ఈనెల 13, 15 తేదీల్లో శిక్షణ కార్యక్రమాన్ని ఆయా నియోజకవర్గాల్లో నిర్వహిస్తారు. అదే విధంగా ఎన్నిక విధుల్లో పాల్గొనేందుకు సుమారు 8500 మంది అదనపు పోలింగ్ సిబ్బంది ని ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశారు. ఎన్నికల విధులకు ఎంపికైన పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు ఈనెల 15న పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12(ఏ) ద్వారా తహసీల్దార్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● స్వీప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. దీనిని జేసీ కార్తీక్ కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, భవిష్యత్తును ఎన్నుకోవాలని జేసీ సూచించారు.



కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి

కూటమిదే విజయం


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు గురువారం 25వ డివిజన్‌లోని నాగోజీపేట నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు. దేశంలో ఎక్కడ డ్రగ్స్‌కి సంబంధించిన సంఘటనలు జరిగినా, దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించడం చారిత్రక అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● విజయనగరం బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు నగరంలోని 3, 4 క్లస్టర్‌లకు చెందిన టీడీపీ నేతలు, క్షేత్రస్థాయిలో ఉన్న వారితో పార్టీ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఓటర్ల జాబితా వెరిఫికేషన్, కొత్తగా ఓటర్ల నమోదు, కుటుంబ సాధికార మిత్ర (కేఎస్ఎస్)ల వివరాలు వెంటనే అందజేయాలని కోరారు. డబుల్ ఎంట్రీ, చనిపోయిన వారి వివరాలను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ నాయకులతో పా టు, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఓటుతో ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి


పార్టీలో చేరిన వారితో లలితకుమారి

జామి: వచ్చే ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి ప్రజలు తమ ఓటు హక్కుతో బుద్ధి చెప్పాలని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అప్పన్నదొరపాలెం, బ్రాహ్మణ వీధి, యాత వీధిలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అన్ని రంగాలను మోసం చేసిందన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మాకిరెడ్డి శ్రీలక్ష్మి, వర్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: గేదెలవానిపాలెం గ్రామానికి చెందిన సర్పంచ్ చప్ప కనకమహాలక్ష్మితో పాటు వైసీపీకి చెందిన 150 కుటుంబాలు ఎస్.కోట నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కోళ్ల లలితకుమారి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సర్పంచ్ భర్త దేముడు మాస్టర్ వైసీపీలో మంత్రి బొత్సకు, చిన్న శ్రీనులకు కీలక అనుచరుడు. కోళ్ల గెలుపునకు తామంతా కట్టుబడి ఉన్నామని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్ పర్యవేక్షణలో మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి ఆధ్వర్యంలో చేరికలు జరిగాయని లలిత కుమారి తెలిపారు. ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు సతీమణి, ఎస్.కోట వైస్ ఎంపీపీ సుధారాణి, ఐదు మండలాల కూటమి నేతలు పాల్గొన్నారు.

వివాదాలు సృష్టిస్తే కేసులు

రామభద్ర పురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గ్రామాల్లో రాజకీయ వివాదాలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. నర్సాపురం గ్రామంలో గురువారం ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ కక్షలు పెంచుకోకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోట వెంకటనాయుడు, హెచ్‌సీ నారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.


నర్సాపురం గ్రామంలో మాట్లాడుతున్న ఎస్ఐ జ్ఞానప్రసాద్

భవిష్యత్తుకు గ్యారెంటీని పూర్తి చేయాలి

తెర్లాం: భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశమైన ఆయన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగాల కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి యుగంధర్, మాజీ ఎంపీపీ బోడెల సింహాచలం, నాయకులు చేపేన శశిభూషణరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి శంకుస్థాపన

లక్కవరపుకోట (కొత్తవలస): రామలింగాపురం గ్రామంలోని బంగారమ్మ చెరువు మధ్యలో శివాలయ నిర్మాణానికి గురువారం గ్రామ పెద్దలు శంకుస్థాపన చేశారు. అంపోలు ఉమామహేశ్వరశర్మ పూజలు చేశారు. గ్రామ స్థులంతా ఐక్యంగా ఆలయ నిర్మాణానికి కృషి చేయాలని పెద్దలు నెక్కల నాయుడుబాబు, కోళ్ల శ్రీను కోరారు.

బీమా చెక్కు అందజేత

వేపాడ: వేపాడ గ్రామానికి చెందిన విశాఖ డెయిరీ పాడి రైతు వంటాకు చినదేముడు అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. డెయిరీ యాజమాన్యం మంజూరు చేసిన బీమా చెక్కు రూ.30 వేలను గురువారం ఉదయం మృతుడి కుమారుడు వంటాకు చిన్నంనాయుడుకి అందజేశారు. పాల కేంద్రం అధ్యక్షుడు నాగిరెడ్డి దేముడుబాబు, సర్పంచ్ మెలిపాక రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చంద్రబాబుకే జనం మద్దతు


బొబ్బిలి మహారాణిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బేబీనాయన

బొబ్బిలి: జగన్ మరోసారి రాష్ట్రాన్ని ఏలేందుకు ఎన్ని జిత్తులమారి వేషాలు వేసినా జనం మద్దతు ఇక ఎన్డీయే కూటమిలోని చంద్రబాబుకేనని బొబ్బిలి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. గురువారం పట్టణంలోని మహారాణిపేట ప్రాంతంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి అందరినీ తమను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 13వ వార్డు టీడీపీ నాయకులు బొట్ట తిరుపతమ్మ, మాజీ కౌన్సిలరు గొర్లె అంకులు, వార్డు ఇన్‌చార్జి బొట్ట శివ, కోటగిరి మానస, బూత్ ఇన్‌చార్జి ములమండల సురేష్, త్రినాథ, బొట్ట అప్పారావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, జనసేన రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పాలూరు బాబు, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

బాడంగి: కోడూరు, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన 150 కుటుంబాలు కూటమి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనా యుడు ఆధ్వర్యంలో గురువారం వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వాడాడలో వైసీపీని వీడి 60 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు సమక్షంలో గురువారం వీరంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

యువతను నిలువునా ముంచిన సీఎం


ప్రచారం చేస్తున్న కోండ్రు

రాజాం: రాష్ట్రంలో యువతను సీఎం నిలువునా ముంచాడని టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో రేగిడి మండలం ఖండ్యాం గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు, సోమరాజుపేటకు చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసీపీ కనుమరుగు కావడం ఖాయమన్నారు. వైసీపీకి చెందిన ఖండ్యాం మాజీ ఎంపిటీసీ బట్న సూర్యనారాయణ కేత రమేష్, లక్ష్మీనారాయణ, రాగోలు రామ్మూర్తి, రాగోలు రామారావు, ఎం.నూకరాజు, టి.దుర్గారావు, కె.రమణ తదితరులు ఉన్నారు. సోమరాజుపేటకు చెందిన మజ్జి కోటిబాబు, రాజబాబు, శ్రీనివాసరావు, మజ్జి దుర్గారావు, అప్పలనాయుడు, లక్ష్మణరావు తదితరులు టీడీపీలో చేరారు.

రాజాం/రూరల్: సీఎం జగన్‌రెడ్డి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడని, వలంటీర్లను రెచ్చగొట్టి వైసీపీ రాజకీయంగా లబ్ధి పొందాలని కుట్రలు పన్నుతోందని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం సంతకవిటి మండలం ఇజ్జిపేట, బిల్లాని, తలతంపర పంచాయితీల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. కొల్ల అప్పలనాయుడు, గట్టి భాను, మొయ్యి నారాయణప్పడు, వల్లూరి గణేష్, చెలికాని మహేష్, కోటి వేణుగోపాలనాయుడు, చిత్రాల కాశీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మతల్లి తీర్థం

జామి, ఏప్రిల్ 4: మండలంలోని తాండ్రంగి గ్రామంలో శ్రీ బంగారమ్మ తీర్థమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వందన -దశరథ్ దంపతులు ప్రత్యేకపూజలుచేయించి అన్నసమారాదన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఎడ్లపందాలు అందరినీ ఆకట్టుకున్నాయి.


తాండ్రంగిలో దౌడు తీస్తున్న ఎడ్లు

రామభక్త హనుమాన్‌కు ప్రత్యేక పూజలు

వేపాడ: బొద్దాం గ్రామంలో రామభక్త హనుమాన్ తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. భారీ స్థాయిలో అన్న సంతర్పణ చేశారు. క్రికెట్ పోటీలను నిర్వహించి.. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జగనపరెడ్డి ఈశ్వరరావు, పిల్లా వెంకటరమణ, యర్రా సన్యాసిరావు, నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

వంగర: రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవరి ట్రైనీ డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని ప్రజలను కోరారు. గురువారం పారా మిలటరీ దళాలతో అరసాడలో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజాం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు. ● వేపాడ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా వావిలపాడు, వెల్దాం, వీలుపర్తి, వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో గురువారం పోలీసులు కవాతు నిర్వహించారు. సుమారు 70 మంది పోలీసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఉపేంద్ర, వల్లంపూడి ఎస్ఐ కె.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు. ● రేగిడి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొండవలస, కాగితాపల్లి గ్రా మాల్లో గురువారం పోలీసులు కవాతు నిర్వహించారు. చీపురుపల్లి ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు, రేగిడి ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వంగర: అరసాడలో కవాతు


వేపాడలో...


రేగిడి: కాగితాపల్లిలో..

పవన్ కల్యాణ్ సభను విజయవంతం చేయాలి

శృంగవరపుకోట: నెల్లిమర్లలో ఈనెల 6 శనివారం జరగనున్న జనసేనాని పవన్ కల్యాణ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని శృంగవరపుకోట జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలను కోరారు. కూటమికి చెందిన జనసేన అభ్యర్థి లోకం మాధవికి మద్దతుగా సాయంత్రం 4గంటలకు రామతీర్థాల కూడలి వద్ద సభను ఏర్పాటు చేశారన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఎస్.కోట వేపాడ, ఎల్.కోట కొత్తవలస, జామి మండలాలకు చెందిన కూటమి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని సూచించారు.

నగరంలో 'మహిళా మేలుకో'

విజయనగరం రూరల్: విజయనగరంలోని 32, 33, 34 డివిజన్ల పరిధిలో గురువారం టీడీపీ మహిళా విభాగం నేతలు 'మహిళా మేలుకో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నేతలు అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి, కంది శమంతక మణి, మురిపెన పద్మలత, సియ్యాదుల ఝాన్సీ, సుంకరి సునీత తదితరులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తమ అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు కందువా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ నాయకుల ప్రచారం

రామభద్రపురం: బొబ్బిలి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బేబీనాయన ప్రచారంలో రామభద్రపురం మండలానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి బేబీనాయన, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడులను సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని టీడీపీ నాయకులు కూనిశెట్టి భాస్కరరావు, జనసేన నాయకులు అల్లు రమేష్, కనకల శ్యామ్ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరు పాల్గొన్నారు.

9 నుంచి వసంత నవరాత్రులు

జామి: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి వసంత నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు మట్టా జనార్దనరావు, భవాని తెలిపారు. మాధవరాయ మెట్టలో నూతనంగా నిర్మించిన రామాలయంలో వారు మాట్లాడుతూ హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సూర్యారావు, కోటయ్య, పోలరాజు, ధార్మిక జట్టు సభ్యులు పాల్గొన్నారు.

'స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నా'

జామి/శృంగవరపుకోట రూరల్: స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు నియోజవర్గ ప్రజల ఆశీర్వాదం కావాలని గొంప కృష్ణ కోరారు. గురువారం జామి త్రిపురాంతస్వామి, ఎస్.కోట కొట్టాం కోటమ్మతల్లి, రాజీపేట శంబలనగరి ఆశ్రమంలో తన భార్య రమాదేవితో కలిసి పూజలు చేశారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆయన మద్దతుదారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా డీవీఎల్ దేవి

లక్కవరపుకోట (కొత్తవలస): కొత్తవలస మేజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలుగా డీవీఎల్ దేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన న్యాయవాదుల సమావేశంలో సీనియర్ న్యాయవాది దేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బార్ అసోసియేషన్ తెలిపింది. వైస్ ప్రెసిడెంట్‌గా అచ్చిబాబు, కార్యదర్శిగా డి. శ్రీనివాస్, ఉప కార్యదర్శిగా గవర కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బోజంకి సన్యాసిరావు ఎన్నికయ్యారు.

పర్యావరణంపై అవగాహన

రేగిడి: స్థానిక హైస్కూల్‌లో గురువారం పర్యావరణ హిత జీవనశైలిపై విద్యార్థులకు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో నేషనల్ గ్రీన్‌కార్డు సమన్వయకర్త నీల కంఠయ్య, జిల్లా సమన్వయ కర్త బూరి వేణుగోపాలరావు పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కోఆర్డినేటర్, స్థానిక సైన్స్ ఉపాధ్యాయుని బి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చెక్

రాజాం రూరల్: వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలో తాగునీటి సమస్య నివారించేందుకు పూర్తి స్థాయి చర్యలు ప్రారంభించినట్లు ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ సిబ్బంది పర్యటించడం ద్వారా మరమ్మతులకు గురైన బోర్లను గుర్తించి త్వరితగతిన బాగు చేస్తున్నామని వివరించారు. బోర్లు మరమ్మతులకు గురైతే తన కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

సచివాలయం వద్ద జగన్ ఫొటోలు

రాజాం: మాదిగవీధి సచివాలయం వద్ద సీఎం జగన్‌రెడ్డి ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఆరోగ్య శ్రీ కరపత్రాలపైన కూడా జగన్ ఫొటోలు కనిపిస్తున్నాయి. ఈ విషయంలో పురపాలక సంఘ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

స్పందించిన అధికారులు

పెనుబాక సచివాలయం వద్ద ఉన్న శిలాఫలకాలను పేపర్లతో కప్పుతూ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు గురువారం చర్యలు తీసుకున్నారు. 'వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఎంపీడీవో స్పందించారు. సత్యనారాయణపురం సచివాలయం వద్ద మాత్రం కిటీకిలకు వేసిన వైసీపీ రంగులు అలాగే ఉన్నాయి.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

రామభద్రపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో సాయుధ పోలీసులతో కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొంతమంది రాజకీయ నాయకులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సాధన సమితితో స్వావలంబన

బొబ్బిలి: అపారమైన సంపద, సస్యశ్యామలమైన భూములతో విరాజిల్లే ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని 75 ఏళ్ల నుంచి తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేశారని, స్వావలంబన దిశగా తయారు చేసుకునేందుకు శాంతియుత మార్గంలో ఉద్యమానికి నడుం బిగించాలని సామాజిక కార్యకర్త వేమిరెడ్డి లక్ష్మునాయుడు పిలుపునిచ్చారు. గురువారం తన కార్యాలయంలో వివిధ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్రను దోపిడీదారుల నుంచి కాపాడుకునేందుకు ఉత్తరాంధ్ర సాధన సమితి ద్వారా అడుగులు వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఆకుల దా మోదరరావు, సీపీఎం, సీపీఐ నేతలు శంకరరావు, కోట అప్పన్న, సురేష్, పిల్లా లక్ష్మణరావు, గోవిందరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రామభద్రపురం: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని తారాపురం గ్రామానికి చెందిన బెవర సత్యనారాయణ (47) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగవద్దని కుటుంబ సభ్యులు వారించడంతో బుధవారం రాత్రి ఇంటినుంచి వెళ్లిపోయాడు. గ్రామ సమీపంలోని చింతచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం గుర్తించిన స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భా ర్య బెవర మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి


గణనాథ (ఫైల్)

రేగిడి: పాముకాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒప్పంగి గ్రామానికి చెందిన చీకటి గణనాథ(47) రైతు కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 30న పొలం పనిచేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈయనకు భార్య పార్వతి, పిల్లలు రాజేంద్రప్రసాద్, గిరజ ఉన్నారు. ఘటనపై రేగిడి పోలీసులు కేసు నమోదుచేసి రాజాం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

భామినిలో యువకుడు..


నేతాజీ (ఫైల్)

భామిని: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గురండి గ్రామానికి చెందిన దుప్పాడ నేతాజీ(30) గుంటూరు ట్రజరీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆస్తి పంపకాల విషయంలో మనస్తాపానికి గురై వారం రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై మృతుని భార్య భవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బత్తిలి ఎస్ఐ సి.హెచ్. ప్రసాద్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సీతంపేట: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండపల్లి గ్రామానికి చెందిన బిడ్డక మహేష్ (30) బుధవారం తన బంధువుల వివాహం కోసం చిన్న కంబ గ్రామానికి వెళ్లి తిరిగి తన గ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. వజ్జాయిగడ గ్రామ జంక్షన్ దగ్గరకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పడంతో రోడ్డుపై జారి పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు వెంటనే పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యం పొందుతూ బుధవారం రాత్రి చనిపోయినట్టు డాక్టర్ నిర్ధారించారు. దీనిపై మృతుడి భార్య బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడు మహేష్‌కు భార్యతో పాటు ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

నెల్లిమర్ల: నెల్లిమర్ల - విజయనగరం మధ్య రైల్వే పట్టాలపై ఒక మృతదేహాన్ని రైల్వే పోలీసులు గురువారం ఉదయం గుర్తించారు. మృతునికి సుమారు 40 సంవత్సరాల వయసు ఉంటుందని, కాఫీ రంగు లోవర్, తెల్లటి పువ్వుల బొమ్మలతో ఉన్న సిమెంటు కలర్ షర్టు ధరించి ఉన్నాడని శ్రీకాకుళం రైల్వే పోలీస్ స్టేషన్ హెచ్‌సీ ఎస్.మధుసూదనరావు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 91103 035494 నంబరుకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో 15 మద్యం సీసాలతో పట్టుబడ్డ గొట్టాపు సత్యనారాయణ అనే నిందితుని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి ఎస్ఈబీ సీఐ మురళీధర్ తెలిపారు. తన వెంట సబ్‌ఇన్‌స్పెక్టర్లు ఎస్‌వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ

● బొబ్బిలి ఐటీఐ కాలనీలో ఘటన

బొబ్బిలి: ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ పరిధిలోని ఐటీఐ కాలనీలో పెద్దాడ నాగేశ్వరరావు అనే వ్యాపారి నివసిస్తున్నాడు. అతని ఇంట్లో బుధవారం తెల్లవారుజామున దొంగలు చొరబడి ఐదుతులాల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. ఇంట్లో వెనుకనుంచి తలుపులను పగులగొట్టి లోపలికి చొరబడిన దొంగలు బీరువాలో ఉన్న బంగారు నెక్లెస్, చైను, చెవి దుద్దులను చోరీచేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు, ఎస్ఐ లోవరాజు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారన్నారు. క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించింది. ఎస్ఐ లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ చదలవాడ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

సీతానగరం: కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతానగరం మండలం కొత్తవలస గ్రామానికి చెందిన కె జానకి (23) తన భర్తతో తరుచూ గొడవపడుతుండేది. ఈ క్రమంలో కాపురం సక్రమంగా చేసుకోవాలని ఆమె తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 1 తేదీన ఇంట్లో ఉన్న గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం చనిపోయినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాజీనామాలకు వలంటీర్లు దూరం

బొబ్బిలి: అధికార పార్టీ నాయకులు ఎంతగా ఒత్తిడి తెచ్చినప్పటికీ వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసేందుకు ముందుకు రాకపోవడం గమనార్హం. బొబ్బిలి మండలంలో 372 మంది వలంటీర్లను నియమించగా అందులో ఒక్క వలంటీరు మాత్రమే రాజీనామా చేశాడు. మున్సిపాలిటీ పరిధిలో 324 మంది వాలంటీర్లకు గాను ఇంతవరకు 12 మంది రాజీనామా చేశారు. వలంటీర్ వ్యవస్థను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు వైసీపీ చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టినట్లుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 3 వ తేదీ నుంచి ప్రక్రియను ప్రారంభించి 4 వ తేదీ రాత్రికల్లా గణనీయం గా పెన్షన్ల పంపిణీ జరిగిపోవడంతో వైసీపీ అంచనాలన్నీ తలకిందులయ్యాయని టీడీపీ, జనసేన నేతలు అంటున్నారు. వలంటీర్లను పెన్షన్ల పంపిణీ బాధ్యతల నుంచి తప్పించేస్తే ఆ వర్గాల నుంచి ఉప్పెన లాంటి ఉద్యమం వచ్చేస్తుందని, తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని అనుకున్న వైసీపీ ఆటలు సాగలేదని టీడీపీ సీనియర్ నేత పువ్వల శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఇలాంటి చీప్ ట్రిక్స్‌కు జనం పడిపోయే రోజులు పోయాయని అన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో సౌకర్యాల కల్పన

● జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా లెక్కింపు కేంద్ర ప్రాంతంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు తెలిపారు. మండలంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల ఆవరణలోని పలు ప్రాంతాలను ఆయన గురువారం నిశితంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల తదుపరి కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాలకు చెందిన ఓట్లు లెక్కింపు కళాశాల ఆవరణలోనే జరగనుందన్నారు. కళాశాల ప్రాంతంలో అవసరమైన ఏర్పాట్లు చురుగ్గా చేపడుతున్నామని చెప్పారు. లెక్కింపు రోజున అధికంగా వాహనాలు వచ్చే అవకాశం ఉందని, వాహనాలు నిలుపుదలకు కళాశాల సమీపంలోని శ్రీలక్ష్మీ బాలాజీ ఆయిల్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన స్థలాన్ని పార్కింగ్ కోసం పరిశీలించామని తెలిపారు. కళాశాల ప్రాంతానికి చేరుకునేందుకు ఉన్న రహదారులు గతుకులమయంగా ఉండేవని, సీతారాంపురం నుంచి కళాశాల వరకు ఉన్న రహదారి మార్గాన్ని మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లలో విఫలం కాకూడదని సిబ్బందికి సూచించారు. అవాంఛనీయ సంఘటనలు నెలకొనకుండా పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. నియోజకవర్గం పరిధిలోని సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలి, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ పరిశీలనలో పాలకొండ ఆర్డీవో, కురుపాం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీవీ రమణ, తహసీల్దార్ కె.జయ, ఉప తహసీల్దార్ పి.సత్యలక్ష్మీకుమార్, మండల సర్వేయర్ బి.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మండంగి కృష్ణతో పాటు పలువురు సిబ్బంది ఉన్నారు.



ఉద్యాన కళాశాల ప్రాంతంలో పార్కింగ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

పాలకొండ: ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ అన్నారు. గురువారం వెలగవాడ గ్రామంలో పోలీసులు, ప్రత్యేక బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భం గా ఎస్ఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాజంలో అసాంఘిక కార్యక్రమాలు, ప్రజలకు ఇబ్బంది కలిగించే సంఘటనలు ఎవరు సృష్టించినా తగిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



కవాతు చేస్తున్న పోలీసులు

రేషన్ డిపో డీలర్లను ఆదుకోండి

పాలకొండ: రాష్ట్రంలో నామమాత్రపు ప్రతిఫలంతో పనిచేస్తున్న రేషన్ డిపో డీలర్లను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర రేషన్ డీలర్ల అధ్యక్షుడు దివిలీలా మాధవరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, రాష్ట్ర కోశాధికారి ఆర్.గంగాధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. వారు గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రేషన్‌డిపో డీలర్లను కార్మికులుగా గుర్తించి ఈఎస్ఐ పరిధిలోకి తేవాలని, ఈఎస్ఐ నిబంధనల ప్రకారం వైద్య సేవలు కల్పించాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసే విధంగా రేషన్ సరుకుల సంఖ్యను పెంచి పండగ కానుకగా కూడా పంపిణీ చేసి డీలర్లకు ఆదాయం పెంచాలని కోరారు. డీలర్ల సంక్షేమం కోసం ఆదేశించిన బీమా సౌకర్యం, మట్టి ఖర్చులకు రూ.15వేలు చెల్లించాలని, డీలర్ల కోసం సంక్షేమ నిధి, హెల్త్‌కార్డులు ఏర్పాటు చేసి సంక్షేమ చర్యలు కోసం జారీచేసిన జీవో నెం.5ను అమలు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న మాధవరావు

జోగింపేటలో 'బాబు ష్యూరిటీ'

సీతానగరం: జోగింపేటలో టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, ప్రధాన కార్యదర్శి సత్యంనాయుడు ఆధ్వర్యంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి బొమ్మినాయిని లక్ష్మణరావు, సూర్యనారాయణ సమక్షంలో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



విజయ్‌చంద్రకు హారతి ఇస్తున్న మహిళలు

ఉగాది పద్యాల కంఠస్థ పోటీలకు ఆహ్వానం

పాలకొండ: క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా ఉగాది పద్యాల కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్టు శ్రీసూర్యచంద్ర కళా సాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడు బౌరోతు శంకరరావు తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంఠస్థ పద్య పోటీలు ఏప్రిల్ 9న ఉగాది రోజు నిర్వహిస్తామని చెప్పారు. 20 సంవత్సరాల లోపువారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. వేమన సుమతి శతక పద్యాలు 20 పద్యాలు చెప్పాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.300, ద్వితీయ బహుమతి రూ.200, తృతీయ బహుమతి రూ.100 ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనేవారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9441806437 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

భూసార పరీక్షలపై అవగాహన కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు పాఠశాల, కళాశాలల స్థాయి నుంచి భూసార పరీక్షలపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కురుపాం వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఆర్.శ్రీనివాస్, జిల్లా ప్రకృతి వ్యవసాయశాఖ ప్రబంధకుడు పి.షన్ముఖరాజు తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు భూసార ఆరోగ్య పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొలాలకు భూసారం సక్రమంగా సమతుల్యంగా అందిస్తే పంటలు అధిక రాబడి ఇస్తాయన్నారు. రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త డా.పి.స్రవంతి మాట్లాడుతూ తమ కేవీకేలో రైతులకు అందుబాటులో పలు రకాల శిక్షణలను అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పెంటన్న, మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్, వ్యవసాయశాఖ సహాయకుడు భార్గవ్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పర్యావరణ పరిరక్షణ చట్టాలను తెలుసుకోండి



ర్యాలీ చేస్తున్న అటవీ సిబ్బంది, విద్యార్థులు

సాలూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని తెలుసుకోవాలని సాలూరు అటవీ రేంజర్ కారుమూరి రామారావు అన్నారు. మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం చట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడో తరగతి విద్యార్థి గంగవంశం చరిష్మా ఆంగ్లంలో పర్యావరణ పరిరక్షణపై చేసిన ప్రసంగం ఆహూతులను ఆకట్టుకున్నది. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేయలేని స్థితిలో ప్రభుత్వం

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో పింఛన్లు పంపిణీ చేయలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని టీడీపీ అరకు బీసీ సెల్ అధ్యక్షుడు బూరాడ రామ్మోహనరావు విమర్శించారు. గరుగుబిల్లి గ్రామంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో సచివాలయాల సిబ్బందితో సరైన సమయంలో పంపిణీ చేసేందుకు రూపకల్పన చేసి ఉంటే ఇంత జాప్యం ఉండేది కాదన్నారు. బస్సు యాత్రలో జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సమావేశంలో టీడీపీ ప్రతినిధులు కె.వెంకటరమణ, సీహెచ్ అప్పారావు, పవన్‌కుమార్ ఉన్నారు.

నీటికుంటల పరిశీలన

మక్కువ: కొయ్యన్నపేట గ్రామంలో తవ్విన నీటి కుంటలను సీఆర్డీ సాంకేతిక నిపుణుడు పి.జానకిరావు గురువారం పరిశీలించారు. పంట పొలాలు, ఉద్యాన తోటల్లో నీటి కుంటలు ఏర్పాటుతో భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. దీంతో వేసవిలో పశువుల దాహార్తితో పాటు వర్షపు నీరు నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చునని రైతులకు అవగాహన కల్పించారు. ఉపాధి హామీ సాలూరు క్లస్టర్ ఏపీడీ శ్రీహరి, ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



నీటి కుంటలను పరిశీలిస్తున్న సాంకేతిక నిపుణులు

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

పాచిపెంట: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని మూటకూడు, గొట్టూరు పంచాయతీలలోగల కుడుమూరు, తోకమెట్ట, దిగువ గొట్టూరు, ఎగువ గొట్టూరు, జొడ్డపాడు గిరిజన గ్రామాల్లో ఆమె గురువారం ప్రచారం చేశారు. ఆయా గ్రామాలకు చెందిన 60 కుటుంబాలు టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు అధ్యక్షతన పార్టీలో చేరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముఖి సూర్యనారాయణ, నాయకులు గూడేపు యుగంధర్, కొత్తల పోలినాయుడు, గొర్లె సత్యం, కనకరాజు, దోనేరు ఆనంద్, వంట్ల భాస్కరరావు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

వార్షిక పరీక్షలకు సన్నాహాలు

● రేపటి నుంచి ప్రారంభం

గరుగుబిల్లి: జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వార్షిక పరీక్షల నిర్వహణకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నారు. పాఠశాలల పరిధిలో ఈనెల 6వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 1 నుంచి 8వ తరగతి వరకు చెందిన వారికి సీబీఎస్ విధానంలో, 9వ తరగతికి పాత విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు, 6వ తరగతి నుంచి 9వ తరగతులకు 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రశ్నాపత్రాలు జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనాలకు తరలించారు. పాఠశాలల పరిధిలో తాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల మేరకు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారని ఎంఈవో ఎస్.నాగభూషణరావు తెలిపారు.



ఎమ్మార్సీలో ప్రశ్నపత్రాలను వేరుచేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు

అనారోగ్యంతో బలిజిపేట సీడీపీవో మృతి

సాలూరు/ సీతానగరం: బలిజిపేట అంగన్‌వాడీ సీడీపీవోగా పనిచేస్తున్న సీహెచ్.సుగుణ (54) గురువారం విజయనగరంలో అనారోగ్యంతో మృతిచెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న ఆమె విజయనగరంలో ఉన్న తన చిన్న కుమారుడు చైతన్య వద్ద ఉంటూ వైద్యం చేయించుకుంటున్నారు. గురువారం పీడీ ఆఫీస్‌లో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. తలనొప్పి రావటంతో ఆసుపత్రికి వెళ్తూ మార్గ మధ్యలో మృతిచెందారు. ఆమెకు ఉదయ్‌కిరణ్, చైతన్య అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె సాలూరు పట్టణంలో గత కొంత కాలంగా నివాసం ఉంటున్నారు.

ఉపాధ్యాయ సంఘ నేతలపై కేసు కొట్టివేతపై హర్షం

సాలూరు రూరల్: ఉపాధ్యాయ సంఘాల నేతలపై 2017లో అప్పటి ప్రభుత్వం పెట్టిన కేసును విజయనగరం జిల్లా కోర్టు గురువారం కొట్టి వేయడంపై వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల బదిలీలకు వెబ్ కౌన్సింగ్, పాయింట్లు విధానానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులు జూన్ 28, 2017లో విజయనగరం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ ఉద్యమంలో విజయనగరం కలెక్టరేట్ గేట్ విరిగిపోయింది. ఈ ఘటనపై వివిధ ఉపాధ్యాయ సంఘనేతలపై కేసు నమోదు చేశారు. పలు వాయిదాలకు వారు కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసును కోర్టు కొట్టివేయడంపై ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, నల్ల బాలకృష్ణ, యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు బోడెల విజయకుమార్, అనకాపల్లి గణేష్, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాలి చంద్రశేఖర్, శ్రీనివాసరావు, మోహనరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి గరుగుబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా అవుతున్న 33 కేవీ లైన్ పరిధిలోని చెట్లు కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామని మండల విద్యుత్‌శాఖ ఏఈ బి.శంకరరావు తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. 33 కేవీ లైన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని చెప్పారు.

రావివలస మాజీ సర్పంచ్ మృతి

గరుగుబిల్లి: రావివలస మాజీ సర్పంచ్ మరిశర్ల సింహాచలంనాయుడు (సింబ) మంగళవారం రాత్రి పార్వతీపురంలో మృతిచెందారు. ఈయన దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే మరిశర్ల వెంకటరామినాయుడు కుమారుడు. గత కొద్ది రోజులుగా ఆరోగ్యం బాగోలేక వైద్య సేవలు పొందుతూ మృతిచెందారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

మద్యం షాపుల్లో సిబ్బందికి బదిలీలు చేపట్టాలి

గజపతినగరం: ప్రభుత్వ మద్యం షాపుల్లో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లుకు స్థానచలనం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన మద్యం షాపుల్లో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్ల వల్ల ఎన్నికల సమయంలో ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉన్నాయని మద్యం షాపుల నుంచి విచ్చలవిడిగా గ్రామాలకు తరలివెళ్లే ప్రమాదం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, కోర్ కమిటీ మెంబర్ అల్లూరి రామకృష్ణరాజు, జిల్లా మహిళా విభాగ సభ్యురాలు మండపాక భారతి పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

బొండపల్లి: స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని 16మంది ఎంపీటీసీ సభ్యులతో పాటు పలువురు సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి అభివృద్ధి పనులతోపాటు సమస్యలపై చర్చించడానికి అవకాశం లేదని ఈ సందర్భంగా ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీవో ఎస్.హరిహరరావు, ఎంపీడీవో కార్యాలయ ఏవో డి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

7న జంతు సంక్షేమ చట్టాలపై శిక్షణ

నెల్లిమర్ల: జంతు హింస, జంతు రవాణా చట్టాలపై ఈనెల 7న శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించి గురువారం నెల్లిమర్లలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పశువుల అక్రమ రవాణా, గో మాంసం రవాణా, సంతల్లో పశువుల అక్రమ రవాణా జరుగుతున్నందున వాటిని అరికట్టేందుకు చట్టాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. విజయనగరం కలెక్టరేట్ సమీపంలో ఉన్న యూత్ హాస్టల్‌లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఆర్ సత్యనారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు చోళ్ల రాజకుమారి, నడిపేన సత్యవతి, గార పవన్ కుమార్, సిమ్మల శంకరరావు, టొంపల పైడితల్లి, గుర్రపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలన అంతం కావాలి

చీపురుపల్లి: గత ఐదేళ్లుగా రాష్ట్రంలో నడుస్తున్న రాక్షస పాలనకు చరమ గీతం పాడాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు పిలుపునిచ్చారు. గురువారం చీపురుపల్లి వచ్చిన ఆయన రౌతు కామునాయుడు నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. అనంతరం దన్నాన రామచంద్రుడు, గద్దే బాబూరావు, కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజును వారి నివాసాల్లో కలిశారు. కరణం మురళీమోహనరావు, పేరిపి మాజీ సర్పంచ్ ఎలకల అప్పారావునాయుడు, కోడూరు మాజీ ఎంపీటీసీ రవి తదితరులు కళా సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన వెంట కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, నాలుగు మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళా వెంకటరావు

టీడీపీలో భారీ చేరికలు

దత్తిరాజేరు/విజయనగరం(ఆంధ్రజ్యోతి): దత్తి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బోడసింగి సత్తిబాబు ఆధ్వర్యంలో సుమారు 200 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. వీరంతా విజయనగరంలో గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ క్యాంపు కార్యా లయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని శ్రీనివాస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్య క్షుడు చప్ప చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ పెద్దింటి మోహన్, ప్రధాన కార్యదర్శి ఎం.ఈశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గజపతినగరంలో టీడీపీ జెండా ఎగరేద్దాం

గంట్యాడ: గజపతినగరం నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగుర వేయాలని కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం గంట్యాడ గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. తమ కుటుంబంపై ఆదరాభి మానాలు చూపించాలని కోరారు. మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల గుండెల్లో గుబులు

భోగాపురం: జనసేన పార్టీలో చేరికలను చూసి వైసీపీ నాయకుల గుండెల్లో గుబులు పట్టుకుందని నెల్లిమర్ల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాలకు చెందిన పలువురు నాయకులు గురువారం జనసేన పార్టీలో చేరారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో వీరికి ఆమె కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాకర్లపూడి శ్రీనివాసరాజు, వరుపుల సుధాకర్, దారపు లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగమాధవి

ముగిసిన చిదంబరేశ్వర ఆలయ ప్రారంభోత్సవాలు

రేగిడి: పుర్లి గ్రామంలో వెలసిన శ్రీ చిన్మయిదేవీ సహిత చిదంబరేశ్వర ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం గురువారంతో ముగిసింది. ఆఖరి రోజు ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు, గారపేట ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద స్వామిజీ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. హైందవ సంస్కృతీ సంప్రదాయాలు ఆచరించాలని... శ్రీరాముని అడుగు జాడల్లో నడవాలని సూచించారు. గురువారం శివపార్వతుల ప్రతిష్ఠ, సామూహిక వ్రతాలు, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మకర్త పట్ట పార్వతి, ఆదినారాయణ కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో పూజలు చేశారు.



కోలాటం ప్రదర్శిస్తున్న దృశ్యం

వాహనదారులకు కౌన్సిలింగ్

బొబ్బిలి: పాత బొబ్బిలి జంక్షన్‌లో గురువారం డీఎస్పీ పి.శ్రీనివాసరావు వాహన చోదకులకు కౌన్సిలింగ్ చేశారు. రహదారి భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలన్నారు. ఆయన వెంట ట్రాఫిక్ ఎస్ఐ వి.బలరామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.



కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రాష్ట్రాన్ని దివాలా తీయించారు

జామి: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని దివాలా తీయించారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. గురువారం జామిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో తమ పార్టీ అధినేత జయప్రకాశ్ నారాయణ్ కూటమికి సంపూర్ణ మద్దతు ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుడు భీంపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయి మందిర ప్రతిష్ఠ

బొబ్బిలి: మెట్టవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ షిర్డీ సాయి మందిర ప్రతిష్ఠా మహోత్సవం మూడు రోజుల నుంచి ఘనంగా జరుగుతోంది. మూడో రోజు గురువారం బాబా విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, హారతులు, పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ శిఖరంపై పెద్ద ఎత్తున బూరెలు వేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బూరెలు పడుతున్న భక్తులు

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



పరుశురాంపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రవికుమార్

కొమరాడ: వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు పార్వతీపురం సీఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని పరుశురాంపురం, విక్రాంపురం, శివిని, గుణానుపురం, దుగ్గి, తదితర పోలింగ్ కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే ఎన్నికలను శాంతియుతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ పరిశీలనలో కొమరాడ ఎస్ఐ నీలకంఠం, తదితరులు ఉన్నారు.

ఓటు నమోదు చేసుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

పార్వతీపురం రూరల్: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పార్వతీపురం తహసీల్దార్ ఆనందరావు యువతీ యువకులను కోరారు. మండలంలోని కృష్ణపల్లి తదితర గ్రామాల్లో నీ ఓటు, నీ భవిష్యత్తు కార్య క్రమంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మక్కువ: అనసభద్ర గ్రామ సమీపంలో ఉన్న ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.ఎర్రునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 లోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాల కోసం పాఠశాలలో సిబ్బందిని సంప్రదించాలన్నారు.

సారా స్వాధీనం

పాచిపెంట: ఒడిశా నుంచి ఆంధ్రాకు 30 లీటర్ల సారా దిగుమతి చేస్తుండగా పాచిపెంటకు చెందిన చోడిగింజల సత్యనారాయణను బుధవారం సాయంత్రం అరెస్టు చేసి, గురువారం రిమాండ్‌కు తరలించామని స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో పట్టుకున్నామని చెప్పారు.

10న జాబ్‌మేళా

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 10న భద్రగిరి ఆర్‌జీఐ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో పాసైన విద్యార్థులు జాబ్ మేళాకు హాజరు కావచ్చునన్నారు. మల్టీ నేషనల్ కంపెనీలో 270 ఉద్యోగాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫోటోస్, సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని కోరారు.

కైలాసనాథ యాత్ర ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామంలో కైలాసనాథస్వామి యాత్ర అత్యంత వైభవంగా ప్రారంభమయ్యింది. వందలాది మహిళా భక్తులు కలశాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి పూజలు చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించున్న ఈ యాత్రకు ఎల్విన్‌పేట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఘనంగా బంగారమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న భక్తులు

పార్వతీపురంటౌన్: బెలగాంలో నిర్మించిన బంగారమ్మతల్లి ఆలయంలోని విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర, తది తరులు పాల్గొన్నారు. అలాగే పూజల్లో ఎమ్మెల్యే జోగారావు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.